## అదే చివరి సినిమా



తమిళ అగ్ర కథానాయకుడు దళపతి విజయ్ రాజకీయాల్లోకి రాబోతున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఆయన 'తమిళ వెట్రి కజగం' పేరుతో పార్టీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. 2026లో తమిళనాడు అసెంబ్లీకి జరిగే ఎన్నికలే లక్ష్యంగా తమ పార్టీ కార్యాచరణ ఉంటుందని ఆయన తెలిపారు. క్రియాశీలక రాజకీయాలపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టే యోచనలో ఉన్న విజయ్ తన 69వ సినిమా పూర్తిచేసిన అనంతరం సినీ రంగానికి గుడ్‌బై చెప్పనున్నట్లు పార్టీ ప్రకటన రోజునే వెల్లడించారు. ప్రస్తుతం విజయ్ 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్) చిత్రంలో నటిస్తున్నారు. ఆయనకు ఇది 68వ చిత్రం. వెంకట్‌ప్రభు దర్శకుడు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. ఈ సినిమా పూర్తయిన వెంటనే 69వ సినిమా పట్టాలెక్కనుంది. ఈ సినిమా కోసం పలువురి దర్శకుల పేర్లు తెరపైకొస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం వెట్రిమారన్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయబోతున్నారని తెలిసింది. సామాజిక సమస్యల్ని తనదైన పంథాలో వెండితెరపై ఆవిష్కరించే వెట్రిమారన్.. విజయ్ పొలిటికల్ ఎంట్రీని దృష్టిలో పెట్టుకొని కథను సిద్ధం చేస్తున్నారని తెలిసింది. ఈ చిత్రాన్ని తెలుగు అగ్ర నిర్మాత డీవీవీ దానయ్య తెరకెక్కించబోతున్నారని సమాచారం.



## సెప్టెంబర్‌లో వస్తున్న గ్యాంగ్‌స్టర్

పవన్‌కల్యాణ్ తాజా చిత్రం 'ఓజీ' (ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్) సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ అధికారికంగా ప్రకటించింది. సుజీత్ దర్శకత్వం వహిస్తున్న ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా నిర్మాణం నుంచే అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నది. కొద్ది మాసాల క్రితం విడుదలైన ఫస్ట్ గ్లింప్స్‌కు మంచి స్పందన లభించింది. పవన్‌కల్యాణ్ స్టైలిష్ లుక్స్‌తో కనిపించారు. ఇక ఈ సినిమా కథ విషయానికొస్తే.. ముంబయి, జపాన్ నేపథ్యంలో నడిచే గ్యాంగ్‌స్టర్ కథాంశమిదని, పవన్‌కల్యాణ్ ఇప్పటివరకు ఈ తరహా రోల్‌లో కనిపించలేదని అంటున్నారు. ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకుందని తెలిసింది. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, అర్జున్‌దాస్, శ్రియారెడ్డి, ప్రకాష్ రాజ్ తదితరులు కీలక పాత్రలను పోషిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు.



## ప్రేమలో నందనందనా..

విజయ్ దేవరకొండ 'గీతగోవిందం' చిత్రంలో 'ఇంకేం ఇంకేం ఇంకేం కావాలే..' పాట చక్కటి రొమాంటిక్ మెలోడీగా సంగీతప్రియుల్ని ఆకట్టుకున్న విషయం తెలిసిందే. గోపీసుందర్ స్వరపరచిన ఈ పాటను సిద్‌శ్రీరామ్ ఆలపించగా..అనంత్ శ్రీరామ్ రచన చేశారు. తాజాగా ఇదే కాంబో విజయ్ దేవరకొండ తాజా చిత్రం 'ఫ్యామిలీ స్టార్'లో ఓ పాట కోసం వర్క్ చేశారు. దిల్‌రాజు-శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 5న విడుదలకానుంది. మృణాల్ ఠాకూర్ కథానాయిక. మంగళవారం నుంచి మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలుపెట్టారు. ఇందులోభాగంగా 'నందనందనా..' అనే లిరికల్ సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. ఈ నెల 7న పూర్తి పాటను రిలీజ్ చేయబోతున్నారు. 'ఇంకేం ఇంకేం కావాలి..' పాట తరహాలోనే 'నందనందనా..' చక్కటి ప్రేమగీతంగా ఆకట్టుకుంటుందని, నాయకానాయికల మధ్య కెమిస్ట్రీ ప్రధానాకర్షణగా నిలుస్తుందని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: కేయూ మోహనన్, సంగీతం: గోపీసుందర్, రచన-దర్శకత్వం: పరశురామ్ పెట్ల.



## రియల్ హీరోస్ కథ

'మనందరికి కుటుంబాలు ఉంటాయి. అయితే దేశాన్ని కాపాడే సైనికుడు మాత్రం 130కోట్ల మంది ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావించి కర్తవ్యాన్ని నిర్వహిస్తాడు. అలాంటి సైనికులు, వారి త్యాగాల కథే 'ఆపరేషన్ వాలెంటైన్' అన్నారు వరుణ్‌తేజ్. ఆయన కథానాయకుడిగా తెలుగు, హిందీ భాషల్లో రూపొందించిన చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రం మార్చి 1న విడుదలకానుంది. ఈ సినిమాలోని 'గగనాల' అనే రెండో గీతాన్ని మంగళవారం విడుదల చేశారు. రామజోగయ్యశాస్త్రి రచించిన ఈ గీతానికి మిక్కీ జే మేయర్ స్వరాలను అందించారు. రొమాంటిక్ మెలోడీగా ఈ పాటను తెరకెక్కించారు. ఈ సినిమాలో వరుణ్‌తేజ్ ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. దేశ రక్షణలో అలుపెరుగని పోరాటం చేస్తున్న రియల్ సూపర్‌హీరోస్ కథ ఇదని, దేశభక్తి భావాలను పెంపొందిస్తుందని చిత్ర బృందం పేర్కొంది. శక్తిప్రతాప్ సింగ్ హడా ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు.



## ఆయన అభిమానిగా మారిపోయా

' ఇందులో నా పేరు రచన. యూనిక్ గోల్స్ వున్న అమ్మాయిని. ఈ సినిమాలో అంతర్లీనంగా అద్భుతమైన ప్రేమకథ కూడా ఉంటుంది. దాని గురించి ఇప్పుడు రివీల్ చేయలేను. ఈ సినిమాలో యాక్షన్ ఎంత కొత్తగా ఉంటుందో, రొమాన్స్ కూడా అంత కొత్తగా ఉంటుంది. హీరోహీరోయిన్ల పాత్రల మధ్య కెమిస్ట్రీ యూనిక్‌గా ఉంటుంది' అని కథానాయిక కావ్య థాపర్ అన్నారు. రవితేజ హీరోగా రూపొందిన 'ఈగల్' సినిమాలో ఆమె కథానాయిక. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకరులతో ముచ్చటించింది కావ్య థాపర్. ' ఓ బాలీవుడ్ సినిమా షూటింగ్ కోసం ముంబైలో ఉన్న సమయంలో ఈ సినిమా దర్శకుడు కార్తీక్ ఈ కథ చెప్పారు. చాలా కొత్తగా అనిపించింది. ముఖ్యంగా రవితేజగారి సినిమాలో చేయడం గొప్ప అవకాశం. అందుకే వెంటనే ఓకే అనేశాను. నేను ఓకే అన్నాకూడా లుక్ టెస్ట్ చేసిన తర్వాతే నన్ను హీరోయిన్‌గా ఎంపిక చేశారు. లొకేషన్‌లో రవితేజ అభిమానిని అయిపోయాను. ఆయన వ్యక్తిత్వం చాలా గొప్పది. పాజిటీవ్ ఎనర్జీతో ఎప్పుడూ సరదాగా ఉంటారు. ఆయన వల్ల షూటింగ్ సరదాగా గడిచిపోయింది' అని కావ్య థాపర్ చెప్పారు. పోలాండ్, లండన్ ఇలా అద్భుతమైన లొకేషన్స్‌లో ఇంటర్నేషనల్ స్థాయిలో చిత్రీకరణ జరిపారని, షూటింగ్ ఓ వెకేషన్‌లాగే సాగిపోయిందని, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలో మరిన్ని సినిమాలు చేయాలనుందని కావ్య ఆశాభావం వ్యక్తం చేసింది.



## అల్లు అర్జున్‌తో సినిమా తీయడం నా ధ్యేయం

' మాది చిన్న సినిమా. చిన్న రిలీజ్. 'ఈగల్'తో పోటీపడే పెద్ద సినిమా కాదు. అయినా హంబుల్‌గా అందరికీ ఆమోదయోగ్యంగా ఉన్న నిర్ణయాన్ని తీసుకుని ఈ నెల 10న 'ట్రూ లవర్'ని విడుదల చేస్తున్నాం' అని యువ నిర్మాత ఎస్‌కేఎన్ చెప్పారు. ప్రతిరోజు పండగే, ట్యాక్సీవాలా, బేబీ చిత్రాలను ఆయన నిర్మించారు. మణికందన్, శ్రీగౌరీప్రియ, కన్న రవి ప్రధాన పాత్రధారులుగా తమిళంలో రూపొంది, ఈ నెల 10న విడుదలకు సిద్ధంగా ఉన్న 'ట్రూ లవర్' అనే సినిమాను తెలుగులో అనువదించి, అదే తేదీలో విడుదల చేయనున్నారు ఎస్‌కేఎన్. ఈ సందర్భంగా విలేకరులతో ముచ్చటించారాయన. ' ఒక ఫ్రెండ్ ద్వారా 'ట్రూ లవర్' సినిమా మా దృష్టికి వచ్చింది. మారుతీతో కలిసి ఈ సినిమా చూశాం. అద్భుతం అనిపించింది. తెరపై పాత్రలలో ప్రేక్షకులు తమకు తాము ఊహించుకునేంత గొప్ప కథ,కథనం 'ట్రూ లవర్' సొంతం. అందుకే తెలుగులో విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం. మా 'బేబీ'తో ఈ సినిమాను పోల్చలేం. ప్రేమికులు ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో సాగే కథ 'ట్రూ లవర్' ' అని తెలిపారు ఎస్‌కేఎన్. నిర్మాతగా స్ట్రయిట్ సినిమాలు చేయడమే తనకిష్టమని, మనసును హత్తుకునే అరుదైన సినిమాలు ఇతర భాషల్లో రావడంతో వాటిని తెలుగులో విడుదల చేయాలనే కోరిక పుట్టడం సహజమేనని, బంధాలకు నమ్మకమే పునాది అని తెలియజెప్పే కథాంశంతో దర్శకుడు ప్రభురామ్ వ్యాస్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారని, బన్నీ వాసు ఈ చిత్రాన్ని పంపిణీ చేస్తున్నారని ఎస్‌కేఎన్ చెప్పారు. తాను నాలుగు సినిమాలు నిర్మించనున్నానని, వాటిలో మూడు ప్రేమకథలు కాగా, ఒకటి సైన్స్ ఫిక్షన్ కథాంశమని, అల్లు అర్జున్‌తో సినిమా నిర్మించడం తన ధ్యేయమని ఆయన తెలిపారు.



## భావోద్వేగాలతో కట్టిపడేసే 'యాత్ర-2'

వైఎస్ రాజశేఖరరెడ్డి పాదయాత్ర ఆధారంగా రూపొందిన 'యాత్ర' చిత్రం 2019లో విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. కేరళ సూపర్‌స్టార్ మమ్ముట్టి అందులో రాజశేఖరరెడ్డి పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఆ సినిమాకు కొనసాగింపుగా రూపొందిన సినిమా 'యాత్ర 2'. ఇందులో వైఎస్‌ఆర్‌గా మమ్ముట్టి నటించగా, ఆయన తనయుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాత్రలో తమిళహీరో జీవా నటించారు. 2009 నుంచి 2019 వరకూ ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ పరిస్థితులు, వైఎస్ జగన్ పాదయాత్ర నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని దర్శకుడు మహి వి.రాఘవ్ తెలిపారు. ఈ నెల 8న సినిమా విడుదల కానుంది. 'ఇది తెలిసిన కథే అయినా సినిమా ఎలా తీశాం, ఏ ఎమోషన్‌లో నడిపించామన్నది ఎవ్వరికీ తెలీదు. ఎన్నో ఎమోషనల్ సీన్స్, తెలియని అంశాలు ఈ సినిమాలో ఉంటాయి. మేం చెబుతున్నది నిజమా? అబద్ధమా? అనేది పక్కనపెడితే... ఆ సన్నివేశాల్లో ఉన్న ఎమోషన్ జనాన్ని కట్టి పడేస్తుంది. తండ్రికి కొడుకు ఇచ్చిన మాట అనే పాయింట్ చుట్టూ ఈ కథ నడుస్తుంది. ఎవ్వరినీ కించపరిచేలా ఈ సినిమా ఉండదు. మమ్ముట్టి, జీవాల నటన సినిమాకు హైలైట్' అని తెలిపారు. జగన్ పాత్ర చేయడానికి చాలా కష్టపడ్డానని, యూట్యూబ్ వీడియోలు చూస్తూ ప్రాక్టీస్ చేశానని, దర్శకుడు మహి ఓ తపస్సులా ఈ సినిమా తీశారని, ఇందులో ఎమోషనల్ అంశాలు చాలా ఉంటాయని జీవా తెలిపారు. వైఎస్ భారతి పాత్ర చేయడం పట్ల కథానాయిక కేతకి నారాయణ్ ఆనందం వెలిబుచ్చారు.



## ముద్దు తెచ్చిన తంటా.. నిర్మాతలకు లీగల్ నోటీసులు




హృతిక్‌రోషన్, దీపిక పదుకొణె జంటగా రూపొందిన బాలీవుడ్ చిత్రం 'ఫైటర్' వసూళ్ల సునామీనే సృష్టిస్తోందని చెప్పాలి. ఇప్పటికే 300కోట్ల రూపాయల వసూళ్లను అధిగమించి దూసుకుపోతోందీ సినిమా. ఇదిలావుంటే.. ఈ సినిమాకు అనుకోని వివాదం ఎదురైంది. అస్సాంకు చెందిన ఎయిర్‌ఫోర్స్ అధికారి సౌమ్య దీప్‌దాస్ ఈ సినిమాలోని ముద్దు సన్నివేశంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, చిత్రబృందానికి లీగల్ నోటీసులు పంపించారు. హీరోహీరోయిన్లు అయిన హృతిక్, దీపిక ఇద్దరూ.. ఎయిర్‌ఫోర్స్ యూనిఫాం ధరించి ఈ చిత్రంలో ముద్దు సన్నివేశంలో నటిచడం అనేది చాలా తప్పు అని, అది గౌరవనీయమైన యూనిఫాంని అవమానించినట్టవుతుందని ఆయన ఆరోపించారు. రిపబ్లిక్ డే కానుకగా విడుదలైన 'ఫైటర్' సినిమా సినీ, క్రీడా ప్రముఖుల ప్రశంసలందుకోవడమే కాక, రికార్డ్ వసూళ్లతో దూసుకుపోతోంది. ఈ సందర్భంలో ఇలాంటి పరిణామం ఎదురవ్వడం చిత్రబృందానికి ఇబ్బందికర పరిణామమేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరి ఈ అంశంపై వారెలా స్పందిస్తారో చూడాలి.

## నిర్మాతగా అలియాభట్

బాలీవుడ్ అగ్ర కథానాయిక అలియాభట్ నిర్మాతగా మారారు. 'పోచర్' అనే క్రైమ్ సిరీస్‌కు ఆమె ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా బాధ్యతలు నిర్వర్తించనుంది. ఆమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ సిరీస్ ఈ నెల 23 నుంచి స్ట్రీమింగ్‌కానుంది. రిచీ మోహతా ఈ సిరీస్‌కు దర్శకత్వం వహించారు. ఏనుగు దంతాల స్మగ్లింగ్ నేపథ్యంలో క్రైమ్, మాఫియా అంశాలతో ఈ సిరీస్‌ను తెరకెక్కించారు. అమెజాన్ ప్రైమ్ వంటి ప్రముఖ సంస్థతో కలిసి నిర్మాతగా బాధ్యతలు నిర్వహించడం ఆనందంగా ఉందని అలియాభట్ చెప్పింది. ఆమె మాట్లాడుతూ 'ఈ సిరీస్‌లో గొప్ప సందేశం ఉంటుంది. కేవలం మనుషులపైనే కాదు ఈ భూమి మీద నివసించే ప్రతీ జీవిపై మనం కరుణ చూపించాలనే మానవీయ కోణంలో ఈ సిరీస్‌ను రూపొందించారు. తప్పకుండా ఇది అందరిలో పరివర్తన తీసుకొస్తుంది. ఈ సందేశం చాలా మందికి చేరుతుంది' అని అలియాభట్ పేర్కొంది.



## అందరూ ఇష్టపడేంత గొప్ప కథ 'మంకీ మ్యాన్'

గుంటూరుజిల్లా తెనాలిలో పుట్టిన తెలుగమ్మాయి శోభిత ధూళిపాళ.. ఉత్తరాది, దక్షిణాది అనే తేడా లేకుండా అన్ని భాషల్లోనూ నటిగా సత్తా చాటుతూ దూసుకుపోతున్న విషయం తెలిసిందే. సినిమాలతోపాటు వెబ్ సిరీస్‌తో కూడా ఆమె బిజీబిజీ. ఇవి చాలవన్నట్టు ఇప్పుడు ఏకంగా హాలీవుడ్‌పై కన్నేసింది ఈ అందాలభామ. ప్రస్తుతం ఆమె ఓ హాలీవుడ్ చిత్రంలో నటిస్తున్నది. సినిమా పేరు 'మంకీ మ్యాన్'. దేవ్ పటేల్ దర్శకుడు. ఇందులో శోభిత ప్రధాన పాత్ర పోషిస్తున్నది. ఇటీవల మీడియాతో తన పాత్ర గురించి శోభిత మాట్లాడింది. 'ఇదో భావోద్వేగపూరితమైన కథ. ఇందులో నటించడంచేత సినిమాపై మరింత గౌరవం పెరిగింది. ఇప్పటివరకూ నా కెరీర్‌లో ఇలాంటి పాత్ర చేయలేదు. నాకెంతో స్ఫూర్తినిచ్చిన పాత్ర ఇది. ఛాలెంజ్‌తో కూడిన పాత్రలు చేయడానికి నేను భయపడను. అందుకే ఈ పాత్రను ఓ అవకాశంగా తీసుకున్నాను' అని చెప్పింది శోభిత. ఇంకా మాట్లాడుతూ ' కథ కొత్తగా ఉంటే భాషతో సంబంధం లేదు. ఏ భాషలోనైనా నటిస్తా. ప్రస్తుతం కొత్త కథలపై, కొత్త పాత్రలపై దృష్టిపెట్టాను. అందులో భాగమే 'మంకీ మ్యాన్'. ఈ సినిమా చిత్రీకరణ విషయంలో దర్శకుడు దేవ్ పటేల్ ప్రతిభను అభినందించకుండా ఉండలేం. హనుమంతుడి స్ఫూర్తిగా పేదలను కాపాడుతూ ముందుకెళ్లే ఓ యువకుడి కథగా 'మంకీ మ్యాన్'ని ఆయన తెరకెక్కించారు. ఇటీవల విడుదలైన ట్రైలర్ అందరికీ నచ్చింది. సినిమా ఏప్రిల్ 5న విడుదల కానుంది. భూమిపై ఉన్న ప్రతి వ్యక్తీ ఇష్టపడేంత గొప్ప కథ ఇది' అని నమ్మకంగా చెప్పింది శోభిత ధూళిపాళ.